నమ్మలేని నిజాలు

బంగారు మట్టి
మట్టి అమ్మబడును
మట్టి మాఫియా

భ్రూణ హత్యలు
నూరేళ్ల జీవి బుగ్గి
స్కానింగ్ పాపం

పిట్టకథలు
తుమ్మని గూట్లోకి
మళ్ళెదేండ్లకు

శ్రావణ మాసం
పండుగల జాతర
పువ్వుల మోత.

కప్పు తేవడం
దేశాభిమాన గర్వం
ప్రజా స్వాగతం



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

ఇష్టమొచ్చినట్టు తీరు
పాతుకోండి విగ్రహాలు !
ఎవరి సొమ్ము ఏమి పోదు
ఎందుకండీ ఆగ్రహాలు !

అస్తిత్వం అన్న మాట
తలంటుకే ఇగిరిపాయె !
ఆత్మగౌరవన్నమాట
ఆచ్ పిట్టయి ఎగిరిపాయె !

శ్రీనిజాలు



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 22-8-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:17 పేజీలు:6 వెల: రూ.1/-

## నిండు కుండలా మూసీ.. ఇన్‌ఫ్లో 843.97 క్యూసెక్కులు

**-అవుట్‌ఫ్లో 404 క్యూసెక్కులు**

**-643.03 అడుగులకు చేరిన నీటి మట్టం**

**-రాత్రికి గేట్లు ఎత్తి నీరు విడుదల చేసే అవకాశం**

నల్గొండ, ఆగష్టు 21 :మూసీనదికి భారీగా వరద వచ్చి చేరుతోంది. నిండుకుండలా కనిపిస్తోంది. అయితే మరో అడుగు నీరు చేరితే గేట్లు ఎత్తి కిందకు విడిచిపెట్టే అవకాశం ఉందని



అధికారులు చెబుతున్నారు. మూసీ నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు ఎస్ఈ శివధర్మతేజ కోరారు.

నదిలోకి ఎవరూ దిగొద్దని హెచ్చరించారు. మూసీనది పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కారణంగా నదిలోకి వరద నీరు భారీగా చేరుతోందని అధికారులు తెలిపారు.

**నదిలోకి చేరుతున్న 843.97 క్యూసెక్కుల నీరు..**

మూసీ నదిలో 843.97 క్యూసెక్కుల నీరు చేరుతోందని ప్రాజెక్టు ఎస్ఈ శివధర్మతేజ చెప్పారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 643.03 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నందున ఏ క్షణంలోనైన గేట్లు ఎత్తి కిందకు నీరు విడిచిపెట్టే అవకాశం ఉంది. ఎడమ కాలువ ద్వారా 238.05 క్యూసెక్కులు, కుడికాలువ ద్వారా 166.63 క్యూసెక్కులు, పంప్ హౌస్‌కు 11.15 క్యూసెక్కులు, 49.07 క్యూసెక్కులు ఆవిరి అయిపోగా మొత్తం అవుట్‌ఫ్లో 464.9 క్యూసెక్కులు నీరుగా రికార్డు అవుతుంది.

## ఫామ్‌హౌజ్‌లు లేవు.. చూపిస్తే నేనే కూలుస్తా- కేటీఆర్




హైదరాబాద్, ఆగష్టు 21 : నాకు ఫామ్ హౌజ్ లు లేవని తేల్చి చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తన పేరుతో ఎలాంటి ఫామ్ హౌజ్ లేదని.. తెలిసిన మిత్రుడిది లీజుకు తీసుకున్నానని క్లారిటీ ఇచ్చారు. అది ఒకవేళ బఫర్ జోన్‌లో ఉంటే తానే దగ్గరుండి కూలగొట్టిస్తానని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ? రేవంత్‌రెడ్డి ఫామ్ హౌజ్ ఎక్కడుందో తాను చూపిస్తానన్నారు. పొంగులేటి, కేవీపీ, పట్నం మహేందర్‌రెడ్డి.. గుత్తా, రేవంత్‌రెడ్డికి ఫామ్‌హౌస్‌లు ఉన్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫామ్ హౌజ్ ఎఫ్‌టీఎల్ లిమిట్స్‌లో ఉందని, ఇప్పటికే ఆయన సోదరుడు అక్కడే ఉంటున్నారని గుర్తు చేశారు.

రవ్వంత చేసి.. కొండంత డబ్బా..

రైతుల రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని, అందుకు మంత్రుల మాటలే సాక్ష్యమన్నారు. రుణమాఫీ పేరుతో తెలంగాణ రైతులకు టోపీ పెట్టారన్నారు. రుణమాఫీ పచ్చి బూటకమనేది అర్థమవుతోందంటూ రవ్వంత చేసి కొండంత డబ్బా కొట్టుకుంటున్నారని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో వాళ్లలో వాళ్లకే సమన్వయం లేనట్లుందన్నారు. అందుకే ముఖ్యమంత్రి, మంత్రులు తలోమాట చెబుతున్నారని వివరించారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందన్నారు.. రుణమాఫీతో మరోసారి అబద్ధాల ముఖ్యమంత్రి నిజస్వరూపం బయటపడిందన్నారు కేటీఆర్.

తమ పార్టీ పేరు భారత రాష్ట్ర సమితే కాదు.. భారత రైతు సమితి కూడా అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రుణమాఫీ విషయంలో ప్రభుత్వం స్పందించి ఎప్పటిలోగా ప్రక్రియను పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో పూర్తిగా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. కోస్గి ఉమ్మడి మండలంలో 20,239 రైతు ఖాతాలున్నాయని, అందులో కేవలం 8,527 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని జాబితాను కేటీఆర్ చూపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగకపోవడంతో తెలంగాణ రైతాంగం రగిలిపోతోందన్నారు. మోసం చేసిన రేవంత్ తక్షణం రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక రైతులకు న్యాయం చేసేందుకు రేపు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో ధర్నా చేపడతామని కేటీఆర్ అన్నారు.

తెలుగుతల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేస్తాం..

రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడారని.. అందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేస్తామన్నారు.. రుణమాఫీ ఆందోళనలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, బజారు భాష, చిల్లర భాషతో తాము పక్కదారి పట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కేడర్ బేస్డ్ పార్టీ బీజేపీ- కిషన్‌రెడ్డి

**-వ్యక్తుల కోసం కాదు.. దేశం కోసం పనిచేసే పార్టీ**

**-సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

హైదరాబాద్, ఆగష్టు 21 :బీజేపీ కేడర్ బేస్డ్ పార్టీ అని, వ్యక్తుల కోసం కాకుండా దేశం కోసం పనిచేసే పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నాంపల్లి కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరూ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు కలిగిన పార్టీ బీజేపీ అని తెలిపారు.

**సభ్యత్వ నమోదుతో పార్టీ మరింత బలోపేతం..**

పార్టీ మరింత బలపడేందుకు సభ్యత్వ నమోదు చేయాలని కిషన్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను దృష్టిలో పెట్టుకొని సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త వంద మందిని సభ్యులుగా చేర్పించాలని కోరారు. సభ్యత్వ నమోదును ఒక ఉద్యమం లాగా చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని, దీనికి సభ్యత్వం కీలకమని తెలిపారు. ఆన్ లైన్ సభ్యత్వం తీసుకోవాలని నిర్ణయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 77లక్షల ఓట్లు వచ్చాయని చెప్పారు. వేలాది బూత్ లలో బీజేపీ నంబర్ వన్ గా నిలిచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటికి తూట్లు పొడుస్తుందన్నారు.

**50శాతం కూడా రుణమాఫీ జరగలేదు..**

రాష్ట్రంలో 50శాతం కూడా రుణమాఫీ జరగలేదని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై వాస్తవ పరిస్థితులు బయట పెట్టాలని, లేకుంటే ఆ వివరాలు బీజేపీయే బయట పెడుతుందన్నారు. ఏ గ్రామంలో రుణమాఫీ పూర్తిగా కాలేదని చెప్పారు. ఒక వైపు సభ్యత్వం చేస్తూనే రైతుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తుందన్నారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ లిబరేషన్ డే ను చేయాలన్నారు.

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూ సేకరణ ప్రారంభించండి- రేవంత్

**రెండు పార్ట్‌ల్లో ప్రగతిపై రోజువారీ సమీక్ష చేయాలి**

**-భవిష్యత్ అవసరాలకు తగినట్లు దక్షిణ భాగం ప్రతిపాదిత**

**అలైన్‌మెంట్‌లో మార్పులకు సూచన**

**-భూ సేకరణలో పారదర్శకంగా వ్యవహరించాలి**

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, ఆగష్టు 21 :రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నార.? పనుల పురోగతి ఏమిటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారం తనకు అందజేయాలన్నారు.

ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజు వారీగా ఏం చేశారు. ఏం పురోగతి సాధించారు, దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం, ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతి రోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు.

భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి-ఆమనగల్-షాద్‌నగర్-చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి.. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి విద్యార్థి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

అమరావతి, ఆగష్టు 21 : కడప జిల్లాలో ఘోరం జరిగింది. ఆడుతూ పాడుతూ స్కూల్‌కు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులకు విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. కడప పట్టణంలోని అగాడివీధిలో ఈ ఘోరం జరిగింది. విద్యార్థి తన్వీర్(11)తో పాటు అతడి స్నేహితుడు ఆదాం(10) ఇద్దరు కలిసి సైకిల్‌పై స్కూల్‌కు బయలుదేరారు. స్కూల్ సమీపంలో తెగిఉన్న విద్యుత్ తీగలు తగిలి తన్వీర్ మృతిచెందాడు. గాయపడిన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం వెంటనే ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతులందరికీ రుణమాఫీ చేస్తాం.. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్, ఆగష్టు 21 : రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ కాంగ్రెస్ ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతు సంఘాలకు, రైతు నాయకులకు విజ్ఞప్తి రైతు సమస్యలు పరిష్కరించడానికి తాము ఉన్నామన్నారు. ఆందోళనలు విరమించండి.. మీ వద్దకు గ్రామాల నుండి వచ్చిన సమస్యలను తమకు కానీ, కలెక్టర్ కు కానీ తెలపాలన్నారు. అధికారులతో కలిసి రైతుల సమస్యలు పరిష్కరిద్దామన్నారు.

రుణమాఫీ కి రేషన్ కార్డు ప్రాధాన్యత లేదన్నారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే ప్రతి మండలానికి నోడల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు మీ సమస్యల పరిష్కారానికి మీ వద్దకు వస్తారన్నారు. పది సంవత్సరాలు మోసం చేసిన పార్టీలను నమ్మకండి.. పరేషాన్ కావాల్సిన అవసరం లేదు.. 31వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఆందోళనలు అవసరం లేదు.. ప్రభుత్వం మీ గురించి ఆలోచిస్తుందన్నారు. సాంకేతిక కారణాల ద్వారా రైతుల ఇబ్బంది ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, పరిష్కరించి రుణమాఫీ చేస్తామన్నారు. బ్యాంక్ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం.. అర్హులైన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించండన్నారు. నేటి నుండి వారం రోజుల పాటు మీ గ్రామాలకు రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు వస్తున్నారు.. రుణమాఫీ కాని వారి వివరాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అధికారులు మీ గ్రామంలోని గ్రామపంచాయితీకి, రైతు వేదికలకు వస్తున్నారన్నారు. ఆందోళనకు దిగాల్సిన అవసరం లేదన్నారు.

గత ప్రభుత్వం (బీఆర్ఎస్) రైతాంగాన్ని మోసం చేసి రుణమాఫీ విషయంలో మాట తప్పిందన్నారు. కానీ ఈ రోజు రెండు లక్షల రుణమాఫీ చేయడానికి సిద్ధంగా వున్న కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హులైన అందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హ్యాందాన్ పాల్గొన్నారు.

## ఆర్‌జీ కార్ ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బలగాలు.. భద్రతా ఏర్పాట్ల పరిశీలన

న్యూఢిల్లీ, ఆగష్టు 21 :కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనను నిరసిస్తూ వైద్యులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర బలగాలు మెడికల్ కళాశాల, ఆసుపత్రిని సందర్శించారు.

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌బృందం బుధవారం ఉదయం మెడికల్ కళాశాల, ఆసుపత్రి వద్దకు చేరుకొని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించింది. అక్కడ భద్రతా ఏర్పాట్లపై స్థానిక పోలీసులు, ఆసుపత్రి వర్గాలను ఆరా తీసింది. ఈ సందర్భంగా సీనియర్ సీఐఎస్ఎఫ్ అధికారి ప్రతాప్ సింగ్ మీడియాతో మాట్లాడారు. 'మాకు కేటాయించిన పని నిమిత్తం ఇక్కడికి వచ్చాం. మా పని మమ్మల్ని పూర్తి చేసుకోనివ్వండి. దీనిపై ఉన్నతాధికారులు మీకు తెలియజేస్తారు' అని తెలిపారు.

జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై ఆగస్టు 15 అర్ధరాత్రి పశ్చిమబెంగాల్ అట్టుడికిన విషయం తెలిసిందే. 'స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి మహిళల స్వాతంత్ర్యం కోసం' అంటూ నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మహిళలు అర్ధరాత్రి నిరసన వ్యక్తం చేశారు. నిరసనకారులుగా పేర్కొంటూ సుమారు 40 మంది గుంపు గురువారం అర్ధరాత్రి ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. దవాఖాన ప్రాంగణం లోకి చేరుకున్న ఆందోళనకారులు ఎమర్జెన్సీ విభాగాన్ని, నర్సింగ్ స్టేషన్, మందుల స్టోర్, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఆందోళనకారులను అదుపుచేయడానికి పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు.

ఈ ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసును సుమోటోగా తీసుకొని మంగళవారం విచారణ జరిపింది. కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ దవాఖానపై వందల మంది దుండగులు దాడి చేయడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విధ్వంసకారులపై తీసుకొన్న చర్యలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దవాఖానపై జరిగిన మూకదాడి, ఘటనాస్థలి నుంచి పోలీసులు పారిపోయారన్న ఆరోపణలను న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. క్రైమ్ సీన్ ఉన్న దవాఖానపై దాడి, విధ్వంసం జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు అని ప్రశ్నించింది. వైద్యులు విధుల్లోకి తిరిగి వెళ్లేలా దవాఖాన వద్ద సీఐఎస్ఎఫ్ (అమోఈ) బలగాలను మోహరించాలని ఆదేశించింది.

## ఆళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంపై ఏసీబీ దాడులు..

ఖమ్మం, ఆగష్టు 21 :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల పంచాయతీ అధికారి ఎంపీఓ బత్తిని శ్రీనివాస్, మర్కోడు పంచాయతీ కార్యదర్శి తాటి నాగరాజులు, మర్కోడు ఉపసర్పంచ్ కుర్ర కమల చేసిన అభివృద్ధి పనులకు కమిషన్ కావాలని, బిల్లులు పాస్ చేయడానికి ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయలు కమిషన్ లంచం కావాలని, ఉపసర్పంచ్ కుర్ర కమలను డిమాండ్ చేయడంతో లంచం ఇవ్వడంలో ఆమె నిరాకరించి, ఇష్టం లేక ఏసీబీని ఆశ్రయించారు.

ఆ క్రమంలో బుధవారం కార్యాలయంలో ఎంపీఓ శ్రీనివాస్, కార్యదర్శి తాటి నాగరాజులు 15వేల రూపాయలు కుర్ర కమల వద్ద తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు ఉమ్మడి జిల్లాల ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు. అనంతరం ఫైళ్లు, తదితర అంశాలను పరిశీలిస్తున్నామని, 24 గంటల్లో కోర్టులో ప్రొడ్యూస్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏసీబీ దాడుల కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రతీష్, ఏఎస్ఐ వెంకటరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు.

## చందానగర్‌లో విషాదం.. ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

కొండాపూర్, ఆగష్టు 21 : చేసిన అప్పులు తీర్చలేమోననే భయంతో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్‌పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన వరలక్ష్మి (34), సత్య శివప్రసాద్‌తో గత 6 నెలల క్రితం వివాహం జరిగింది. ఉద్యోగ నిమిత్తం నగరానికి వచ్చి చందానగర్‌లోని కైలాష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు.

సత్య శివప్రసాద్ ఓ ప్రైవేట్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, వివాహానికి ముందు చేసిన అప్పులు తీర్చలేక భయాందోళనకు లోనైన వరలక్ష్మి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సత్య శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## శ్రీశైలం జలాశయం వద్ద విరిగిపడ్డ కొండచరియలు .. తప్పిన ప్రమాదం



అమరావతి, ఆగష్టు 21 :నంద్యాల జిల్లా శ్రీశైలంజలాశయం వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. మండలంలో కురిసిన కుంభవృష్టి వర్షానికి రాత్రి కొండ చరియలు విరిగి పెద్ద బండరాళ్లు ఘాట్‌రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రాత్రి కారణంగా రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం గమనించిన ప్రయాణికులు జిల్లా అధికారులకు సమాచారం అందజేయడంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

రాత్రి నుంచి పరిసర ప్రాంతాల్లో ఎడతెరుపు లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. శ్రీశైలం జలాశయం దిగువన రహదారి మార్గంలో రోడ్డుకు అడ్డంగా కొండ చరియలు విరిగిపడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలోనూ పలుమార్లు కొండచరియలు విరిగిపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు జరుగకముందే అధికారులు కొండచరియలు విరిగిపడక ముందే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**నేటి కందం- నేటికి అందం**

మద్రాసీయులు సతతము
భద్రుల రక్షించు కొరకు పలువిధములుగా
రుద్రాదుల పూజించుచు
మద్రాసు దినంబు జరిపి మనవలె జగతిన్
(22-8-1639 మద్రాసు దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

